TELANGANA CAPITAL EVENING EDITION

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత


TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

09.06.2024

మాటల తూటాలు పేల్చాలన్నా..
ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టించాలన్నా..
పార్టీకి ఊపు తేవాలన్నా..
అభిమానం కూడగట్టాలన్నా..
సెంటర్ ఏదైనా.. గడ్డ మరేదైనా..
గర్జించి విజృంభించడమే
సంజయ్‌కి తెలిసిన పని.

(తెలంగాణ క్యాపిటల్ బ్యూరో, కరీంనగర్)
ఆయనను ముద్దుగా తెలంగాణ హిందూ టైగర్ అని పిలుచుకుంటుంటారు. ఎందుకంటే ప్రభుత్వంపై, విపక్షాలపై విరుచుకుపడడం ఆయన నైజం. ప్రజా సమస్యలపై పోరాడడమే ఆయన ఎంచుకున్న లక్ష్యం. ఒకవిధంగా చెప్పాలంటే అధికారంలో ఉన్న పార్టీకి ఆయన అంటే హడల్. ఆయనను కట్టడి చేస్తే చాలు.. మా నాయకులపై, మా పార్టీపై మాట్లాడేవారు లేరు అని ఇతర పార్టీలు భావిస్తుంటాయి. కాషాయం జెండానే ఆయన అండా.. ఊపిరి. హిందువులే ఆయనకు బంధువులు, బాంధవులు. అందుకే.. ఆయనకు ఒకరు ఇద్దరు కాదు.. పదులు కాదు వందలు కాదు.. వేల సంఖ్యలో అభిమానులు. పార్టీకతీతంగా శత్రువులు.. మిత్రులు ఆయన సొంతం. ప్రభుత్వాలు వేధిస్తున్నా వెరవని విశ్వాసం ఆయన సొంతం. పదుల సంఖ్యలో కేసులు పెట్టినా.. రోజుల తరబడి జైలులో పెట్టినా.. ఎదురొడ్డి ధైర్యంగా నిలబడడమే ఆయనకు తెలిసిన సాహసం. ఇప్పటికే ఆయన ఎవరో అర్థమై ఉండొచ్చు. ఆయనే మన కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్. సామాన్య కార్యకర్తగా ప్రస్థానం మొదలుపెట్టిన సంజయ్.. నేడు కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. కేంద్రంలో హ్యాట్రిక్ ప్రభుత్వాన్ని నెలకొల్పుతున్న మోడీ సర్కార్ కేబినెట్‌లో బండికి సైతం చోటు లభించింది. దీంతో ఆయన అభిమానుల్లో సంబరాలు అంబరాన్ని తాకాయి.





## అధిష్టానం నుంచి అందిన పిలుపు

## నేడే మోడీతోపాటు ప్రమాణస్వీకారం

## విద్యాసాగర్ రావు తరువాత బండికే అవకాశం

## కరీంనగర్ సిగలో మరో ఉన్నత పదవి

## బీజేపీ శ్రేణుల్లో వెల్లువెత్తిన ఉత్సాహం

### రెండోసారి ఎంపీగా తిరుగులేని మెజార్టీ

బండి సంజయ్ 2019లో మొదటి సారి ఎంపీగా గెలుపొందారు. అప్పటి నుంచి నిత్యం ప్రజలతో మమేకం అవుతూ.. కార్యకర్తలకు వెన్నంటి ఉంటూ వచ్చారు. అదే అభిమానంతో మొన్నటి ఎన్నికల్లోనూ ఆయనను గెలిపించారు. మామూలు మెజార్టీతో కాకుండా అఖండ మెజార్టీని కట్టబెట్టారు. ఓ వైపు ప్రత్యర్థులు కుట్రలు చేస్తున్నా.. డబ్బుల ప్రవాహం పారిస్తున్న ప్రజలను నమ్ముకొని ముందుకు సాగారు. ఫైనల్ గా కరీంనగర్ పార్లమెంట్ కు ఉన్న రికార్డులను తిరగరాశారు. మరోసారి ప్రజలు ఎనలేని అభిమానాన్ని చాటారు. సంజయ్ వెన్నంటే ఉన్నామని ఓటర్లు నిరూపించారు. చివరకు సిరిసిల్లలోనూ మెజార్టీ సాధించారు. గెలుపు కోసం అహోరాత్రులు శ్రమించారు. ఆయన వెంటే కార్యకర్తలు నడిచారు.

### మొదటి సారి కేబినెట్ హోదా

రెండు సార్లు ఎంపీగా గెలిచిన బండి సంజయ్ కుమార్ మొదటి సారి కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఎంపీగా ఉండి.. వేల కోట్ల నిధులు తెచ్చిన సంజయ్.. ఇక కేంద్ర మంత్రి అవుతుండడంతో జిల్లాకు మరింత మహర్దశ పడుతుందని ప్రజలు సైతం ఆశతో ఉన్నారు. గతంలో బీజేపీ తరపున కరీం నగర్ నుంచి విద్యాసాగర్ రావు కేంద్ర మంత్రిగా కొనసాగగా.. ఇప్పుడు మరోసారి కరీంనగర్ నుంచి సంజయ్ కేంద్ర మంత్రి హోదాను దక్కించుకున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆయన అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.

# మినిస్టర్ సంజయ్

## కేంద్ర మంత్రిగా బండికి ఛాన్స్


తెలంగాణ క్యాపిటల్
07.06.2024
EVENING EDITION
www.telanganacapitalnews.com
బండికి.. కేబినెట్ బెర్త్?
ఎన్డీయే పక్ష నేతగా ఎన్నికైన మోడీ
మంత్రివర్గం కూర్పుపై కొనసాగుతున్న చర్చ
ఆశలపల్లకిలో సంజయ్ కుమార్
గతంలోనే ప్రధాని నుంచి స్పష్టమైన హామీ

ఈనెల 07వ తేదీన తెలంగాణ క్యాపిటల్ న్యూస్‌లో ప్రచురితమైన కథనం.. మా కథనమే నిజమైంది..

# సామాన్య కార్యకర్త నుంచి..



## బండి సంజయ్ కుమార్ వ్యక్తిగత ప్రొఫైల్

పేరు: బండి సంజయ్ కుమార్
పుట్టిన తేదీ: 11-7-1971
తల్లిదండ్రులు: (కీ.శే. బండి నర్సయ్య) - శకుంతల.
మతం: హిందువు
కులము: మున్నూరుకాపు,(బి.సి-'డి')
భార్య: బండి అపర్ణ(ఎస్.బి.ఐ ఉద్యోగిని)
పిల్లలు: సాయి భగీరత్, సాయి సుముఖ్

**ప్రస్తుత బాధ్యతలు:**
కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి

**గతంలో చేపట్టిన బాధ్యతలు:**

- బాల్యం నుంచే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లో స్వయం సేవకుడిగా.
- అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్ లో పట్టణ కన్వీనర్, పట్టణ ఉపాధ్యక్షునిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా..
- ది కరీంనగర్ కో-ఓపరేటివ్ అర్బన్ బ్యాంక్ లో రెండు పర్యాయాలు (1994-1999; 1999-2003) డైరెక్టర్ గా..
- బిజెపి జాతీయ కార్యాలయం,ఢిల్లీ లో ఎన్నికల ప్రచార ఇంచార్జ్ గా..
- భారతీయ జనతా యువ మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి, పట్టణ అధ్యక్షునిగా, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గా, రాష్ట్ర ఉపాధ్య క్షునిగా, నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గా, జాతీయ కార్యదర్శిగా సేవలందిస్తూ కేరళ,తమిళనాడు ఇంచార్జి గా బాధ్యతలు చేపట్టారు.
- ఎల్.కె అద్వానీ చేపట్టిన సురాజ్ రథ యాత్రలో వెహికల్ ఇంచార్జిగా..
- కరీంనగర్ నగర పాలక సంస్థగా ఏర్పడిన తర్వాత మొట్టమొదటిగా 48వ డివిజన్ నుండి బిజెపి కార్పొరేటర్ గా, రెండవసారి అదే 48వ డివిజన్ నుండి భారీ మెజారిటీ తో హ్యాట్రిక్ విజయం సాధించారు.
- వరుసగా రెండు పర్యాయాలు నగర బిజెపి అధ్యక్షునిగా.
- 2014 సాధారణ ఎన్నికల్లో కరీంనగర్ శాసనసభ బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి, 52,000 వేల పై చిలుకు ఓట్లు సాధించి రెండవ స్థానంలో నిల్చున్నాడు.
- 2016లో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియామకమయ్యారు.

2019 ఎన్నికల్లో తిరిగి బిజెపి తరుపున కరీంనగర్ శాసనసభ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసి 66009 ఓట్లను సంపాదించి రెండవ స్థానంలో ఉండగా, రాష్ట్రంలో పోటీ చేసిన బిజెపి అభ్యర్థుల్లో ప్రథమ స్థానంలో నిల్చున్నారు.

- 2019 పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బిజెపి అభ్యర్థిగా పోటీచేసి, టీఆరెస్ కంచుకోటను బద్దలు కొట్టి 96వేల పైచిలుకు ఓట్లతో ఘనవిజయం సాధించారు.
- 2019 ఓబీసీ వెల్ఫేర్ పార్లమెంట్ కమిటీ మెంబెర్ గా నియామకం (ఇంకా కొనసాగు తున్నారు)
- 2019 అర్బన్ డెవలప్మెంట్ పార్లమెంట్ కమిటీ మెంబర్ గా నియామకం (ఇంకా కొనసాగుతున్నారు)
- 2019 టొబాకో బోర్డు మెంబెర్ గా నియామకమై సేవలందించారు.
- 2019 మైనారిటీ అఫైర్స్ స్టేట్ లెవెల్ కమిటీ మెంబెర్ గా నియామకం.
- 2020 ఎయిమ్స్ బీబీనగర్ బోర్డు మెంబెర్ గా నియామకం, (ఇంకా కొన సాగుతున్నారు)
- 2020 మార్చి 11 నుంచి 2023 జూలై 3 వరకు బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా పని చేశారు.
- 2023 జూలై 8న జాతీయ కార్యవర్గ సభ్యులుగా నియామకం.
- 29 జూలై 2023న బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి గా నియామకమయ్యారు.
- 2023 నవంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి, 89016 ఓట్లు సాధించి 3163 ఓట్ల తేడాతో ఓటమి
- 2024 మే లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి 5,85,116 ఓట్లు సాధించి, 2,25,209 మెజారిటీతో రెండవ సారి ఎంపిగా గెలుపు. 2006 ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ కు 2,01,581 ఓట్లు రాగా, 2014 లో వినోద్ కుమార్ కు 2,05,007 ఓట్లు వచ్చాయి. ఇప్పటివరకు ఇవే అత్యధిక ఓట్లు కాగా.. తాజా ఫలితాలతో బండి సంజయ్ కుమార్ ఆ రికార్డులను బద్దలు కొట్టి, కరీంనగర్ చరిత్రలో మరో కొత్త రికార్డు నెలకొల్పారు.



బండి సంజయ్ 1971 జులై 11న శకుంతల, నర్సయ్య దంపతులకు జన్మించారు. నాన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. సంజయ్‌ని తన తండ్రి ఒకటో తరగతిలోనే సరస్వతి శిశుమందిర్‌లో చేర్పించారు. దాంతో అప్పటినుండే ఆయన ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆర్ఎస్ఎస్‌లో ఘటన్ నాయక్‌గా, ముఖ్య శిక్షక్‌గా ప్రాథమిక విద్యా స్థాయిలోనే పనిచేశారు. ఎన్నికల నేపథ్యంలో అద్వానీ రథయాత్ర నిలిచిపోవడంతో బండి సంజయ్‌ను ఢిల్లీ సెంట్రల్ ఆఫీస్‌లో సహాయక్‌గా నియమించారు. బండి సంజయ్ ఏబీవీపీ కరీంనగర్ పట్టణ కన్వీనర్‌గా, పట్టణ ఉపాధ్యక్షునిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. 1994-2003 మధ్యకాలంలో ది కరీంనగర్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో రెండు పర్యాయాలు డైరెక్టర్‌గా పనిచేశారు. భారతీయ జనతా యువమోర్చా కరీంనగర్ పట్టణ ప్రధాన కార్యదర్శి, పట్టణ అధ్యక్షునిగా, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబెర్‌గా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్‌గా, జాతీయ కార్యదర్శిగా వివిధ హోదాల్లో పార్టీలో పనిచేశారు. అనంతరం బీజేపీ కేరళ, తమిళనాడు ఇన్‌చార్జిగానూ బాధ్యతలు నిర్వహించారు. 2005లో ఏర్పడిన కరీంనగర్ నగర పాలక సంస్థకు జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి 48వ డివిజన్ నుండి కార్పొరేటర్‌గా మూడుసార్లు గెలుపొందారు. సంజయ్ రెండు పర్యాయాలు కరీంనగర్ బీజేపీ అధ్యక్షునిగానూ పనిచేశారు. 2014 సాధారణ ఎన్నికల్లో కరీంనగర్ శాసనసభ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యాడు, 2018లో తెలంగాణ అసెంబ్లీకి జరిగిన ముందస్తు ఎన్నికల్లో కరీంనగర్ స్థానం నుండి బీజేపీ తరపున పోటీ చేసి తన సమీప టీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌పై 14,000 పైగా ఓట్ల తేడాతో ఓడిపోయాడు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరపున కరీంనగర్ లోక్‌సభ స్థానం నుండి పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి బి.వినోద్ కుమార్‌పై 89,508 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అలాగే.. 2020 మార్చి 11 నుండి 2023 జులై 4 వరకు ఆయన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. జులై 8న బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమితు డయ్యారు. బండి సంజయ్‌ని 2023 జులై 29న పార్టీ అధిష్టానం జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నుండి పోటీ చేసి ఓడిపోయారు. 2024 లోక్‌సభ అభ్యర్థిగా మరోసారి బరిలో నిలిచి అఖండ మెజార్టీతో విజయం సాధించారు.

## అన్నలే ఆయన బలం..

బండి సంజయ్ కి ఇద్దరు అన్నలు ఉన్నారు. శ్రవణ్ కుమార్, సంపత్ కుమార్, సంజయ్ కుమార్ ముగ్గురు అన్నదమ్ములు. కాగా.. సంజయ్ రాజకీయాల్లో ఇంతలా రాణిస్తు న్నారంటే దాని వెనుక అన్నదమ్ములు ఇస్తున్న సపోర్టు అంతా ఇంతా కాదు. ఒకవిధంగా సంజయ్ గెలుపులో ఆయన అన్నదమ్ముల పాత్ర చాలా కీలకమనే చెప్పాలి. కార్యకర్తలను వెన్నుతట్టి ప్రోత్సహించడం.. పోల్ మేనేజ్ మెంట్ చేయడం.. సమావేశాలు నిర్వహిచడం.. కుల సంఘాలను ఏకం చేయడం.. ఇలా ఒకటి రెండు కాదు అన్నిరకాలా సంజయ్ కి సపోర్టుగా నిలిచారు. ఎన్నికల సమయంలో వారు పడిన కష్టం సైతం మామూలు కాదు. ముందు నుంచి సంజయ్ ని వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ వస్తున్నారు. అలాగే.. సంజయ్ కి తన భార్య అపర్ణ సైతం ప్రోత్సాహం అందించడంతో ఆయన ఎన్ని కేసులనైనా.. ఎన్ని ఇబ్బందులనైనా ఎదుర్కొని ముందుకు సాగారు. కుటుంబం సహకారం వల్లే ఈ రోజు ఆయన కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

## కేసులతో వేధించినా..

ఏప్రిల్ 2023లో తెలంగాణ రాష్ట్ర బోర్డు పదో తరగతి పరీక్షల ప్రశ్నపత్రం లీక్ కేసులో ప్రమేయం ఉందన్న ఆరోపణలపై బండి సంజయ్ కుమార్, మరో ముగ్గురిని అరెస్టు చేశారు. అతన్ని అరెస్టు చేసిన రోజున, ఈ కేసులో నిందితుడు 1 (కుమార్) మరియు నిందితుడు 2 (ప్రశాంత్) మధ్య పంచుకున్న కొన్ని వాట్సాప్ చాట్ లను పోలీసులు పంచుకున్నారు. 'బండి సంజయ్ ఫోన్ లేదు. కానీ మేము త్వరలో వాట్సాప్ సందేశాలు, సంభాషణలను తిరిగి పొందుతాము. వారు కొన్ని సందేశాలు, కాల్ లాగ్ లు/కాల్ డేటాను తొలగించారు. మేము ఆ వివరాల న్నింటినీ తిరిగి పొందుతాము' అంటూ వరంగల్ కమిషనర్ ఆ సమయంలో అన్నారు. ఏప్రిల్ 7న సంజయ్ బెయిల్ పై విడుద లయ్యారు. తన విడుదలపై ఒక ప్రకటనలో, అతను పోలీసుల అసమర్థతను ఆరోపించాడు. పేపర్ లీక్ పై న్యాయ విచారణకు డిమాండ్ చేశారు. మరోవైపు.. పేపర్ లీక్ కు సంబంధించి బీజేపీ పరువు తీయాలనే కుట్రలో భాగమే కుమార్ అరెస్టు అని జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ అన్నారు. దాంతోపాటే ఇంకా చాలా కేసుల్లోనూ గత ప్రభుత్వం హయాంలో సంజయ్ ని వేధించారు.